# సీత. పీతల బాధ గాధలు!

బాధలేని బతుకులేదు. బాధ అంటే- కష్టం నష్టం, అరిష్టం, అయిష్టం. భయం గాయం, అపజయం, అసహాయం.




"నీ అంత అపురూప సౌందర్యవతిని నేనెక్కడా చూడలేదు. నీవులేనిదే నేను లేను. నీవులేని బతుకు ఎందుకూ కొరగాని చితుకు అంటున్నాడు మోహన్. పెళ్లీగిళ్లీ పాత చింతకాయ పచ్చడి. కలిసి ఉందాం, కలదు సుఖం అన్నాడు. అలాగే ఉంటున్నాం. నేనూ పాత చింతకాయ పచ్చడైతే మోహన్ కొత్తదారి వెతుక్కుంటాడేమో" అని సుశీల బాధ. భద్రత అంటూ సుశీల మళ్లీ పెళ్లిగోల చేస్తుందేమో అని మోహన్ బాధ.

ఈ పరీక్షల్లో మంచి మార్కులొస్తాయో లేదో, కనీసం పాసవుతానో లేదో అని విద్యార్థి బాధ. పాసయ్యాక ఉద్యోగం వస్తుందో లేదో అని బాధ. ఉద్యోగం వచ్చేక ప్రమోషన్ రావడంలేదని బాధ.

ఉద్యోగాల్లో పనిచేతగానివాడికి పనిచేతనైనవాణ్ని చూస్తే బాధ. పనిమంతుడికి పని రానివాడితో బాధ.

కథలు రాసేవాడు 'ఓస్ ఈ మాత్రం కవిత నేను రాయలేనా' అని రాయబోతే బాధ. కవిత్వం రాసేవాడికి 'ఓసోస్, ఆ మాత్రం కథ నేను రాయలేనా' అని రాయబోతే బాధ.

పూరి గుడిసెవానికి పక్కనే వున్న మేడ యజమానిని తలచుకుని బాధ.

ఇంత మేడ పక్కన పూరి గుడిసె వుందే అని మేడ యజమానికి బాధ.

కూతురికి పెళ్లి చెయ్యలేకపోతున్నానే అని తండ్రి బాధ. తండ్రి తనకెలాగూ రాకుమారుడిని తేలేడనీ ఏసేవకునితో ముడిపెడతాడోననీ కూతురి బాధ.

ఈ రోజయినా బిడ్డలకి ఓ పూటతిండి పెట్టగలనో లేనో అని ఓ నిరుపేద తల్లి బాధ. అమ్మ ఇంకా అన్నం పెట్టదే అని ఆ తల్లీ బిడ్డల బాధ.

'ఇవేళ, చికెన్ ఎక్కువ తినేశాను. అరుగుతుందో లేదో' అని ధనవంతుడికి బాధ.

కడుపు నిండని వాడికి ఆకలి బాధ. కడుపు నిండినవాడికి అజీర్తి బాధ.

చిన్న వ్యాపారం చేసేవాడికి ఎప్పుడే నష్టం వస్తుందోనని బాధ. ఉద్యోగస్తునికి భద్రత ఉంటుంది కదా అని మరో బాధ. తనకు లేదనే బాధతోపాటు మరొకడికి వుందని బాధ.

కె.వి.యస్.వర్మ ఫీచర్స్

కూతురి పెళ్లికి ఎక్కువ కట్నం అడుగుతున్నారనీ, కొడుక్కి తక్కువ కట్నం ఇస్తామంటున్నారనీ ఓ తల్లిదండ్రుల బాధ. కొడుకు కట్నం తీసుకోకుండా వివాహం చేసుకున్నాడని మరో తల్లిదండ్రుల బాధ.

కూలి డబ్బులకు రోజూ తిప్పుతున్నాడని వ్యవసాయ కార్మికుని బాధ. అమ్మిన ధాన్యానికి ఇవ్వాల్సిన డబ్బు రేపిస్తాను, మాపిస్తానంటూ, రైస్ మిల్లర్ తిప్పుతున్నాడని రైతు బాధ. సన్నగా ఉన్న వాళ్లను చూసి లావు పాటి వాళ్ల బాధ. కొంచెం ఒళ్లు వస్తే బాగుండునని సన్నపాటి వాళ్ల బాధ.

పులికి ఎక్కడ దొరుకుతానోనని లేడి బాధ. లేడి తన పంజాకు ఎప్పుడు దొరుకుతుందో ఏమిటోనని పులి బాధ.

పులి, లేదా లేడి అయినా తన బాణానికి నేలకొరుగుతాయో లేదో అని వేటగాడి బాధ.

ఇంకా వానపడదేం అని రాయలసీమ వాడి బాధ. ఇంకా వానపడితే చేను మునిగిపోతుందని కోస్తా వాడి బాధ.

రాసిన తన నవల అచ్చవుతుందో లేదోనని రచయిత బాధ. తీరా అచ్చయ్యాక, సినిమాగా వస్తుందో లేదోనని బాధ. "కథలకి కరువొచ్చింది. ఏ నవలన్నా సినిమాకు పనికొస్తుందేమోనని చదివితే సినిమా కథల్నే నవలలుగా రాసేస్తున్నారంటూ" నిర్మాత బాధ.

తమ ఊరి పంచాయితీ మెంబరయ్యాక, సర్పంచ్ ఎప్పుడవుతానా అని బాధ. సర్పంచ్ అయ్యాక జిల్లా నేత ఎప్పుడవుతానా అని బాధ. ఆ తర్వాత ఎమ్మెల్యే అవ్వాలనీ అదీ అయితే మంత్రిగా ఎప్పుడు అధికారం చెలాయిస్తానా అని బాధ.

కోటి తర్వాత కోట్లకు కోట్లు ఎలా పెంచుకోవాలా అని హర్షద్ మెహతాకు ఒకప్పుడు బాధ. ఆ ఊబిలోంచి ఎలాగన్నా బయటపడతానో లేదోనని అతనికి ఇప్పుడు బాధ.

'దాణా' బొక్కిన కొందరి వ్యవహారంతో తాను 'లాలూ'చీ పడ్డట్టు విమర్శలు రావడం బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ బాధ.

అధికారంలో కొనసాగడానికి మెజార్టీ కోసం కొందరు ఇతర పార్టీల సభ్యులకు ముడుపులు ముట్టజెప్పినట్టు వచ్చిన ఆరోపణలు తనకు ఊపిరి సలపనియ్యడంలేదని ఆ మధ్య మాజీ ప్రధాని నరసింహారావు బాధ.

తమ మద్దతుతో అధికారంలో కొనసాగుతున్న దేవెగౌడ తను ఆడమన్నట్లల్లా ఆడతాడో లేదోనని ఆ తర్వాత పీవీ బాధ. ప్రధాని పదవిలో ఉండీ మాజీ ప్రధాని చేతిలో కీలుబొమ్మగా ఉండాల్సి వస్తోంది కదా అని గౌడ బాధ.

యూరియా స్కామ్‌లో చిక్కుకున్నందుకు ప్రభాకరరావు బాధ. అతను తన సుపుత్రుడయినందుకు పీవీ బాధ.

ఆర్జించిన కోట్ల సుఖం అంతా దుఃఖమవుతోందని కేంద్ర మాజీమంత్రి సుఖ్‌రాం బాధ. సుఖ్‌రాం చలవతో పెరిగిందంతా, తరుగటకేనా అని పాతూరు రామారావు బాధ. సుఖ్‌రాంను బహిష్కరించకపోతే అతను కాంగ్రెస్‌కు బరువు అని చర్య తీసుకోక తప్పకపోవడం ఆ పార్టీ అధ్యక్షుని బాధ.

మొన్నటిదాకా నెత్తికెక్కించుకున్న శశికళనూ, కోట్లు విరజిమ్మి పెళ్ళి చేసిన దత్తపుత్రుడినీ దూరం చేసుకోవాల్సి రావడం, లేదా వారితో తెగతెంపులు చేసుకున్నట్టు ప్రకటించక తప్పకపోవడం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత బాధ.

మద్య నిషేధం కొనసాగించడానికి ఇతర పన్నులు వెయ్యక తప్పకపోవడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ. ఆ కారణంగా ప్రజల దృష్టిని మళ్లించడానికి 'ఆల్మట్టి డాం' ఎత్తు ఎత్తవలసి రావడం, ఆ సమస్య సమస్యగానే నానడం ఆయన మరోబాధ.

అసెంబ్లీలో ప్రతిపక్ష శాసనసభ్యులు పదేపదే అడ్డుతగిలితే ఆర్థిక మంత్రి అశోక్ గజపతిరాజుకు బాధ. పదే పదే నాకు బాధగా ఉంది' అని పన్నెండుసార్లు ఒకే రోజున ఆయన అంటే ప్రతిపక్ష సభ్యులకు బాధగాదు, నవ్వే నవ్వు! పదకొండుసార్లు 'నాకు బాధగా ఉంది.' అనే అశోక్ బాధను భరించిన స్పీకర్‌కు పన్నెండోసారి'నాకు బాధగా ఉంది' అనే మాట ఆయన నోట మళ్లీ వినగానే భరించశక్యంగాని బాధ.

అందుకే, "అయితే, ఏం చెయ్యమంటారు? రోజూ గంటలకు గంటలు కూర్చుని ఈ గోలంతా వినడం నాకూ బాధగానే ఉంది'' అని బయటపడాల్సి రావడం స్పీకర్ యనమల రామకృష్ణుడి బాధ.

మహాకవి శ్రీశ్రీ అన్నట్టు సీత (కష్టాలు) బాధలు సీతవి. పీత (కష్టాలు) బాధలు పీతవి!

ఇందరి ఇన్ని బాధలు ఏకరువుపెట్టీ, ఇంకెన్నో మిగిలిపోయాయని చెప్పాల్సి రావడం కూడా ఒక బాధే!.

30.8.96

వార్త దినపత్రిక,